# అత్తగారి అంతర్యం



కథ

ఆదుర్తి బాల

రమణమ్మగారిల్లు ఆ రోజు సందడిగా వుంది. రోజూ కన్నా పెందరాళే లేచి స్నానం చేసి దేవుడి పూజ చేసుకుంది రమణమ్మ. పూజయ్యాక మడి చీర మార్చి మంచి జరీ చీర కట్టుకుని వంటగదిలో పని చేసుకుంటున్న పెద్దకోడలు సువర్చల దగ్గరకెళ్లింది రమణమ్మ.

"ఇదిగో అమ్మాయ్ ఉప్మాలో జీడిపప్పు ఎక్కువెయ్. నీ మరిదికి జీడిపప్పు ఉప్మా అంటే మహా ఇష్టం. నీ తోటికోడలికి పెరుగువడలంటే ప్రాణం. కనుక ముందర ఆ రెండూ చేసెయ్. టిఫెన్‌కి పనికొస్తాయ్. మధ్యాహ్నం భోజనంలోకి మామిడికాయ పప్పు, దోసకాయ పచ్చడి చెయ్. బంగాళ దుంప ఫ్రై చేసి ముక్కల పులుసు పెట్టు. అన్నం కాస్త ఎక్కువ వండితే కొంత పులిహోరకి పనికొస్తుంది" అంటూ పెద్దకోడలికి పని పురమాయించింది రమణమ్మ. ఇంత హడావిడికి కారణం ఆరోజు ఆమె చిన్నకొడుకూ కోడలూ చెన్నై నుండి వస్తున్నారు మరి. ఇద్దరివీ పెద్ద హోదాగల ఉద్యోగాలే. అందుకే ఈ ప్రత్యేక మర్యాదలు.

ఇంత బండచాకిరీ చేయడానికి మనసులో విసుగ్గానే వున్నా, అత్తగారి మాటకి ఎదురుచెప్పలేక మౌనంగా పనిచేసుకుపోతోంది సువర్చల. ఎంత పని చేసినా గుర్తింపా ఏమన్నానా? ఈ ఇంట్లో తనొక అన్-పెయిడ్ సర్వెంట్. ఏడాది పొడుగునా రిపెయిర్స్ రాకుండా పనిచేసుకుపోయే ఓ యంత్రం- నిర్లిప్తంగా అనుకుంది సువర్చల.

అసలు చిన్నకొడుకు 'ప్రదీప్' చిన్న కోడలు 'ఉమ' వస్తున్నారంటేనే ఎక్కడలేని ఉత్సాహం వచ్చేస్తుంది అత్తగారికి. అవును మరి చిన్నకోడలు ఊరికే రాదుగా వస్తూ వస్తూ అత్తగారికి చీరలు తెస్తుంది. పళ్ళు, స్వీట్లూ తెస్తుంది. అత్తయ్యా మీ వంట్లో బాగుంటోందా, పెద్ద వయసు కదా వేళకి మంచి ఆహారం తినాలి మీరు. పళ్ల రసాలు తాగాలి అంటూ పక్కనే కూర్చుని తియ్యటి కబుర్లు చెబుతుంది. చిన్నకొడుకు

ఆడది ఉద్యోగం చేసి సంపాదిస్తుంటే బంధువర్గాల్లో ఆమెని ప్రత్యేకంగానే చూస్తారు. తన అత్తగారూ అందుకు మినహాయింపు కాదు. అందుకే తన చిన్నకోడలి గురించి అందర్లో గొప్పగా చెప్పుకుంటుంది అనుకున్నది సువర్చల.

సువర్చల ఆలోచనలిలా సాగిపోతుండగానే ఇంటి ముందర ఆటో ఆగింది. అందులోంచీ అట్టహాసంగా దిగారు ప్రదీప్, ఉమ. హడావిడిపడుతూ జరీ చీర సరిచేసుకుంటూ ఎదురెళ్ళింది రమణమ్మ వారిని ఆహ్వానించడానికి. వస్తూనే అత్తగారి కాళ్ళకి దణ్ణం పెట్టింది ఉమ.

"నూరేళ్ళూ అష్టైశ్వర్యాలతో, పిల్లాపాపలతో వర్ధిల్లమ్మా" కోడల్ని లేవనెత్తుతూ అన్నది రమణమ్మ.

"బాబోయ్ పిల్లాపాపలనకండి అత్తయ్యా- అంత మందిని కనే టైం లేదు. పాపో బాబో ఒకరు చాలు మాకు" నవ్వేస్తూ అన్నది ఉమ.


"నిజమేలేమ్మా-ఏదో అలవాటుగా అనేశాను. పెద్ద

కూడా వెళ్ళేటప్పుడు వాళ్ళమ్మ చేతిలో ఓ నాలుగు వేలో ఐదు వేలో పెట్టి ఖర్చు పెట్టుకోమ్మా అంటాడు. ఆవిడ ఆ డబ్బంతా పెట్టెలో పెట్టి తాళం వేసేస్తుంది. అందులోంచి ఒక్క రూపాయి కూడా బయటికి తియ్యదు. పోనీ ఇక్కడే వుంటోంది కాబట్టి తన దగ్గరున్న డబ్బులో కాస్త తీసి ఇంటి ఖర్చులకి వాడచ్చు కదా అనిపిస్తుంది సువర్చలకి. పోనీ అత్తగారిమీద అంత ప్రేమ కురిపిస్తోంది కదా చిన్న కోడలు- ఈవిడ వెళ్ళి అక్కడ కొన్నాళ్ళు ఉంటానంటుందేమో అనుకుంటుంది సువర్చల. ఈవిడ పొరపాటున కూడా చిన్నకోడలి దగ్గరికెడతానని అనదు. వాళ్ళూ రమ్మనరు. పైగా అందుకో అందమైన కారణం కూడా చెబుతారు. "మేమిద్దరం ఉద్యోగాలకి వెళ్ళిపోతే అత్తయ్య ఒక్కరే వుండడం కష్టం. ఇరుగుపొరుగు వారితో ఆవిడ కాలక్షేపం చేద్దామన్నా భాష సమస్య కదా! పోనీ కొన్నాళ్ళు సెలవు పెడదామన్నా మీకు తెలీనిదేముంది అంత హోదాగల ఉద్యోగంలో ఉన్న మాకు చీటికి మాటికి శెలవులివ్వరాయె! ఏం చేస్తాం అత్తయ్యకి సేవ చేసుకునే అదృష్టం లేకపోయింది" అంటూ బాధ నటిస్తుంది ఉమ. అవన్నీ నాలిక చివర్నుంచీ వచ్చిన మాటలేనని సువర్చలకి తెలుసు. రమణమ్మకీ తెలుసుగానీ బయటపడదు. నవ్వేసి ఊరుకుంటుంది.

ఉద్యోగం మనిషికి సామాజిక హోదా ఇస్తుంది. మగవాడు వుద్యోగం చేసి సంపాదించడం తరాలనుంచి వున్నదే గనుక ఎవరూ పట్టించుకోరు. కానీ

ఉద్యోగస్తురాలివి మరి సరిగా తినడానికే టైం వుండదు. ఇంక పిల్లల్ని కని పెంచడమంటే మాటలా" అన్నది రమణమ్మ.

మరిదికీ, తోటి కోడలికీ కాఫీలు, టిఫెన్లూ అందిస్తూ బిజీ అయిపోయింది సువర్చల. టిఫెన్లు తినడం అయ్యాక స్నానాలు కానిచ్చి తీరిగ్గా కూర్చుని అత్తగారికి తను తెచ్చిన చీరలు చూపించింది ఉమ. వాటిని చూస్తూ మురిసిపోతూ చిన్నకోడల్ని పొగడ్తలతో ఆకాశానికెత్తేస్తోంది రమణమ్మ. వంట గదిలో పనిచేసుకుంటున్న సువర్చలకి హాల్లోంచి తోటికోడలు చెప్పే కబుర్లన్నీ వినబడుతూనే వున్నాయి. ఉద్యోగస్థుల జీవితాల్లోని సాధక బాధకాలన్నీ వర్ణించి వర్ణించి చెప్తోంది. ఆమె కబుర్ల నిండా అతిశయోక్తులే. తినడానికి, వండడానికి టైం లేదన్నట్టు చెబుతోంది. తోటికోడలి వాక్చాతుర్యానికి ఆశ్చర్యపోయింది సువర్చల. అసలు తన మరిది ఒక్కడి జీతంతోనే సౌకర్యంగా బతకచ్చు. అప్పుడీ టెన్షన్లు లేకుండా ఉండవచ్చుగా. ఉమ కూడా ఉద్యోగం చేయాల్సిన అవసరమేమిటి - వస్తు వినిమయం పెరిగి మనిషి ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. వస్తువులు అవసరాలు తీర్చడంతో పాటు కొత్తహంగులు కావాలని కోరుకుంటున్నారు. మామూలు ఫోను వుంటే చాలదు. అందులో ఎఫ్.ఎం. రేడియో, ఎం.పి. 3, వీడియో కెమెరా కూడా వుండాలి. మామూలు టీవీ వుంటే కుదరదు ఫ్లాట్ టీవీనో, ఎల్.సి.డి.టీవీనో కావాలి. డబల్ డోర్ ఫ్రాస్ట్ ఫ్రీ ఫ్రిజ్‌లు



కావాలి. ఒకప్పటి ఇళ్ళకి సిమెంట్ ఫ్లోరింగో, నాపరాయో పరుచుకునే వాళ్ళు. ఇప్పుడది పనికిరాదు. చలువరాయి, మొజాయిక్ ఫ్లోరింగ్‌లు. గోడలకు ఆల్‌టెక్ పెయింట్లు కావాలి. అవసరాన్ని తీరుస్తూనే హంగులు కూడా కావాలిప్పుడు. ఇవన్నీ కావాలంటే డబ్బుండాలి. ఒకరి సంపాదనతో ఇన్ని హంగులు అసాధ్యం కనుక ఇద్దరూ ఉద్యోగం చేయాలి. ఎన్ని హంగులు కూర్చుకుంటే అంత గొప్ప. తన ప్రత్యేకతనీ గొప్పనీ పెంచుకోవడానికి ఉద్యోగం చేసి తీరాలి. పైగా ఉమలాంటి వారికి ఉద్యోగం ఒక స్టేటస్ సింబల్- సువర్చల ఆలోచనలిలా సాగిపోతూనే ఉన్నాయ్.

"అమ్మా పిన్ని చూడు నాకేం తెచ్చిందో" అంటూ ఉమ తెచ్చిన బట్టలూ, బొమ్మలూ సువర్చలకి చూపిస్తూ మురిసిపోతున్నారు సువర్చల పిల్లలు రమ్య, దివ్య.

ప్రదీప్, ఉమ ఉన్న నాలుగు రోజులూ సినిమాలూ, షికార్లు, షాపింగులూ వంట పనీ, ఇంటి పనితో బిజీగా గడిచిపోయింది సువర్చలకి. ఆరోజు మరిది వాళ్ళు తిరుగు ప్రయాణం అవుతున్నారు. వంట పూర్తి చేసి ప్రదీప్, ఉమ ట్రైన్‌లో తినడానికని చపాతీలూ, కూరా తయారుచేసి ప్యాక్ చేసింది సువర్చల. ఆ ప్యాకింగ్‌లన్నీ వాళ్ళ బ్యాగ్‌లలో సర్దమని ఇవ్వడానికి వెడుతున్న సువర్చలకి బెడ్ రూంలో నుండి అత్తగారి మాటలు వినిపించాయి. "ఈమధ్య ఒంట్లో ఏం బాగుండటం లేదురా అబ్బాయ్. డాక్టరు దగ్గరకెడదామంటే బోల్డన్ని టెస్టులు చేసి స్కానింగ్, ఎక్స్‌రే అంటాడు. మందులకీ, టెస్టులకీ, డాక్టరు ఫీజులకీ బోల్డంత ఖర్చవుతుంది. నీకు తెలుసుకదరా నీ అన్నయ్య పరిస్థితి. వాడి జీతం ఇంటి ఖర్చులకే బొటాబొటిగా సరిపోతుంది. ఈ ఖర్చులన్నీ తట్టుకోవడం వాడి వల్ల అవుతుందా. నువ్వు ఓ పది వేలైనా సర్దితే డాక్టరుకి చూపించుకుందామనుకుంటున్నాను" అంటోంది రమణమ్మ.

"అలాగేనమ్మా ఈ పదివేలూ ఉంచుకో. మంచి డాక్టరుకి చూపించుకో" అంటున్నాడు ప్రదీప్.

కొడుకిచ్చిన డబ్బులు జాగ్రత్తగా పెట్టెలో పెట్టి తాళం వేసుకుంది రమ

ఇమ్మ.

వీళ్ళు వచ్చినప్పుడల్లా ఏదో వంకపెట్టి డబ్బులు గుంజుతోంది. అదంతా మూటగట్టి దాచుకుంటుంది. ఈ వయసులో ఇంత డబ్బు పిచ్చి ఏమిటో అనిపించింది సువర్చలకి.

ఆటో పిలుచుకొచ్చాడు సువర్చల భర్త సుబ్రహ్మణ్యం. వెళ్ళబోతూ ఎప్పటిలాగానే అత్త కాళ్ళకి దణ్ణం పెట్టింది ఉమ. కోడల్ని దీవించి చటుక్కున తన మెడలో గొలుసుతీసి కోడలి చేతిలో పెట్టింది రమణమ్మ. గొలుసు చూడగానే ఉమ కళ్ళు మెరిశాయి. పైకి మాత్రం "ఇప్పుడెందుకత్తయ్యా" అంది మొహమాటపడుతున్నట్టుగా.

"నీకు కాదులేవే పుట్టబోయే నా మనవడికి లే" అన్నది రమణమ్మ.

ఇదంతా చూస్తున్న సువర్చల ముఖం మాడిపోయింది. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టుగా, ఎప్పుడో పుట్టబోయే మనవడికి ఇప్పుడే బహుమతులు! అనుక్షణం బామ్మా, బామ్మా అంటూ ఆవిడ కొంగుపట్టుకు తిరిగే తన పిల్లలకి మొండిచెయి. ఆ ఇచ్చేదేదో తన పిల్లలకి ఇవ్వచ్చుగా. ఇక్కడుండి తన చేత చాకిరీ చేయించుకుంటోంది. బహుమతులు ప్రశంసలూ వాళ్ళకి. అంతే డబ్బు మహిమ! తన భర్త పెద్ద ఉద్యోగస్తుడయితే తననీ ఓ మహారాణిలా చూసేదేమో. అంతా తన ఖర్మ. లోలోపలే ఉడికిపోయింది సువర్చల. ఆరోజునుంచి అత్తగారితో ముభావంగా వుండడం మొదలుపెట్టింది. చీటికీమాటికి విసుక్కోవడం కూడా చేస్తోంది.

ఆ రోజు సుబ్రహ్మణ్యం ఒంట్లో బాగోలేక ఆఫీసుకి శెలవు పెట్టాడు.

"ఈమధ్య మీకు ఒంట్లో బాగుండటం లేదు అంటున్నారు కదా ఓసారి డాక్టరుకి చూపించుకోరాదూ" అన్నది సువర్చల.

"నెలాఖరు కదే డబ్బులెక్కడుంటాయ్" విసుగ్గా అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇది మరీ బాగుంది. ఆరోగ్యంకన్నా డబ్బు ముఖ్యమా ఏమిటి. మీ దగ్గర లేకపోతే మీ అమ్మనడిగి తీసుకోండి. మొన్న మీ తమ్ముడినడిగి పదివేలు తీసుకుంది. మీరడిగితే కాదనదు" అత్తగారికి వినిపించేటట్టు అన్నది సువర్చల.

"మెల్లిగా మాట్లాడవే అమ్మ వింటే బాగుండదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఎందుకు బాగుండదూ - ఇన్నాళ్ళూ ఆవిడకి చాకిరీ చేసినందుకు ఆమాత్రం ఇవ్వలేదా - అయినా అంత డబ్బు ఆవిడమాత్రం ఏం చేసుకుంటుంది" గట్టిగానే అన్నది సువర్చల.

అంతా విన్న రమణమ్మ నెమ్మదిగా వచ్చింది కొడుకు దగ్గరికి.

నుదుటి మీద చెయ్యి వేసి "ఏరా ఒంట్లో ఎలా వుంది?" అన్నది ఆప్యాయంగా.

"ఏం లేదమ్మా సీజన్ మారిందిగా కాస్త జ్వరం వచ్చినట్టనిపించింది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

సువర్చల ఊరుకోలేదు. "అదేం కాదత్తయ్యా ఆయనకి తరచూ జ్వరం వస్తోంది. డాక్టరు దగ్గరకెడదామంటే నెలాఖరు రోజులు కదా డబ్బెలాగ అని ఆలోచిస్తున్నారు. మిమ్మల్నడిగి తీసుకోమంటున్నాను" అన్నది.

"ఇది మామూలు జ్వరమేలేవే భయపడకు. నా దగ్గర డబ్బు వున్నా అది ఖర్చుపెట్టడం కుదరదు" కచ్చితంగా అన్నది రమణమ్మ.

ఒక్కసారిగా బరస్ట్ అయిపోయింది సువర్చల "అవున్లెండి ఆ డబ్బు మాకెందుకిస్తారూ - అదంతా మూటకట్టి మీ చిన్నకోడలికి ఏ వడ్డాణమో, కాసుల పేరో చేయించి ఇస్తారు. ఎంతైనా వాళ్ళంటే అభిమానం మీకు. అందుకేగా మొన్న వాళ్ళు వచ్చినప్పుడు మెళ్ళో గొలుసు తీసి మరీ ఇచ్చారు. నాకూ ఇద్దరు ఆడపిల్లలున్నారు. మా పరిస్థితి ఏంటో తెలుసు మీకు. అయినా అన్నీ తెలిసీ అంతా వాళ్ళకే కట్టబెట్టాలని చూస్తున్నారు. చాకిరీ చేయడానికి మాత్రం నేను పనికొస్తాను"

మనసులో ఉన్న ఉక్రోషాన్నంతా బయటపెట్టింది సువర్చల. అంతా విన్న రమణమ్మ ప్రశాంతంగా నవ్వింది. ఏం మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది. ఇంత జరిగినా రమణమ్మ ఏం జరగనట్టే ప్రవర్తిస్తోంది. కానీ ఇంటి పనుల్లో కాస్త సహాయం చేయడం మొదలుపెట్టింది. నడుం వంగిపోయినా చీపురుపట్టుకొని వాకిలి చిమ్మేది. పనమ్మాయి రానప్పుడు గిన్నెలు కడిగేది. ఆవిడ ఆ వయసులో అలాంటి పనులు చేస్తూంటే సువర్చల మనసు చివుక్కుమనేది. వెళ్ళి ఆవిడ చేసే పని ఆపాలనిపించేది కానీ ఏదో అహం అడ్డొచ్చి బింకంగా ఊరుకునేది.

ఆ రోజు రమణమ్మకి హార్ట్ఎటాక్



## అనుష్కకి పొగడ్తలు

టాలీవుడ్‌లో టాప్ పొజిషన్‌కొచ్చేసిన అనుష్క ఇప్పుడు తమిళ చిత్రసీమ కోలీవుడ్‌లోనూ దుమ్ము లేపబోతోంది అంటున్నారు కొంతమంది తమిళ ప్రముఖులు. ముఖ్యంగా తమిళంలో మాస్ హీరోగా మాంచి క్రేజ్ వున్న హీరో విజయ్ సరసన అనుష్క నటిస్తోందిప్పుడు. 'వేటక్కారన్' అనే పేరున త్వరలో విడుదల కానున్న ఆ సినిమాలో అనుష్క అద్భుతంగా కనిపిస్తుందని సాక్షాత్తూ మాస్ హీరోగారే తెగ ప్రశంసలు కురిపిస్తున్నారట. దాంతో ఇతర హీరోయిన్లు కాస్త హడావిడి పడడం సహజమే కదా! మరి విజయ్ జోస్యం ఎంతవరకూ నిరూపణ అవుతుందో చూద్దాం!

వచ్చింది. హాస్పటల్‌లో చేర్చారు. బంధువులు ఒక్కొక్కరూ వచ్చి దిగుతున్నారు. మరిది, తోటికోడలూ కూడా వచ్చారు. ఆవిడని చూడడానికి అందరూ హాస్పిటల్‌కి వెళ్ళారు. పని వుండడంతో సువర్చల ఒక్కత్తే ఇంట్లో వుండిపోయింది. ఇంతలో ఫోన్ మోగింది.

"అమ్మ నిన్ను చూడాలంటోంది. త్వరగా బయల్దేరిరా" భర్త సుబ్రహ్మణ్యం ఫోన్ చేయడంతో ఇల్లు తాళం పెట్టి హాస్పటల్‌కి బయలుదేరింది సువర్చల.

ఆటోలో కూర్చున్న సువర్చలకి జరిగిపోయిన సంఘటనలన్నీ గుర్తుకువచ్చాయి. మనసంతా ఏదో తప్పుచేసిన ఫీలింగ్ కలిగింది. పెద్దావిడ అని కూడా చూడకుండా ఎన్నెన్ని మాటలంది తను. ఎంతసేపూ తను ఆవిడకేదో చాకిరీ చేశానని అనుకుందే కానీ ఆవిడ తమ ఇంట్లో ఉండడం వలన తన కుటుంబానికెంత మానసిక స్థైర్యం కలిగిందో ఆలోచించలేదు తను. రోజూ రాత్రి భోజనాలవగానే బామ్మకిరుపక్కలా పడుకొని ఆవిడ చెప్పే కథలు వినడానికి రెడీ అయిపోతారు తన ఇద్దరు పిల్లలూ, తనూ, తన భర్తా. ఎప్పుడైనా సినిమాకి వెళితే పిల్లలు అల్లరి చేస్తారని ఆవిడ దగ్గరే వదిలి వెడుతుంది తను. తనకిగానీ తన భర్తకిగానీ ఏ సమస్య వచ్చినా ఆవిడతో చెప్పుకుంటే తన అనుభవంతో ఓ మంచి పరిష్కారం చెప్పేది. తామందరికీ పెద్దదిక్కుగా మంచి చెడూ చెబుతూ ఆవిడ ఇంట్లో మసలుతూంటే ఆ నిండుదనమే వేరు. డబ్బుపోయినా సంపాదించుకోగలం. మనిషిని, మమతని సంపాదించుకోలేం. భగవంతుడా నా తప్పు క్షమించు. ఆవిడని క్షేమంగా ఇంటికి చేర్చు. దారిపొడుగునా దేవుడిని ప్రార్థించింది సువర్చల.

"హమ్మయ్య వచ్చావా? అమ్మ నిన్నే కలవరిస్తోంది త్వరగా పద" హాస్పిటల్‌లోకి అడుగుపెట్టగానే గబగబా ఎదురొచ్చి సువర్చలతో అన్నాడు సుబ్రహ్మణ్యం.

హాస్పిటల్ బెడ్‌మీద ఉన్న అత్తగార్ని చూడగానే సువర్చల దుఃఖం ఆపుకోలేకపోయింది. "నన్ను క్షమించండి అత్తయ్యా! మీరు డబ్బులివ్వలేదనే కోపంతో ఏదేదో అనేసాను. అయినా అది మీ డబ్బు మీ ఇష్టం. అడిగే హక్కుగానీ అధికారం గానీ లేదు నాకు. మీరు కావాలి నాకు.. మీరు క్షేమంగా ఇంటికి తిరిగి వస్తే అదే పదివేలు" దుఃఖంతో గొంతు పూడుకుపోతూ వుండగా అన్నది సువర్చల.

రమణమ్మ ముఖంలో ప్రశాంతతతో కూడిన నవ్వు మెరిసింది. "పిచ్చిదానా నీ మనసు నాకు తెలీదేంటే. ఆ మాటకొస్తే ఏ బిడ్డ మనస్తత్వం ఎలాంటిదో తల్లికిగాక మరెవరికి తెలుస్తుందే. ఒకే తల్లికి పుట్టిన బిడ్డలైనా అందరి మనస్తత్వం ఒకలా ఉండదు. నీ భర్త అమాయకుడు. నీ మరిది గడుసు. వాడికి తగ్గా భార్యే ఉమ కూడా. వాడికెలాగూ నన్ను తీసుకెళ్ళి వాళ్ళ ఇంట్లో ఉంచుకోవడం ఇష్టం లేదు. ఆ సంగతి నాకూ తెలుసు. ఇద్దరం ఉద్యోగం చేస్తున్నాం. అమ్మ ఒక్కర్తీ ఇంట్లో ఉండలేదనే చెప్తాడు పైకి. అంత ఒక్కర్తినీ వుండలేకపోవడానికి నేనేమీ మంచం పట్టలేదుగా. ఇప్పుడే కాదు వాడెప్పుడూ నన్ను వాళ్ళింటికి పిలువలేదు. వాళ్ళ స్వేచ్ఛకి అడ్డువస్తానని కాబోలు. నన్ను చూడకపోతే పోనీ కనీసం డబ్బయినా ఇవ్వాలి కదా. తల్లి బాధ్యత తీసుకోడు కాబట్టి వాడినుంచి డబ్బు రాబట్టాలి. కోడలి అనుమతి లేనిదే వాడు నాకు పది రూపాయలు కూడా ఇవ్వలేడని తెలుసు నాకు. అందుకే కోడల్ని మంచి చేసుకోక తప్పలేదు నాకు. ఉమని పొగడడం, అదొచ్చినప్పుడు కాస్త హడావుడి చేయడం అందులో భాగమే. డాక్టరు ఖర్చులకని, మందులకనీ తీసుకున్న డబ్బంతా దాచి నీ పిల్లల పేర ఫిక్స్‌డ్ డిపాజిట్లో వేస్తే వాళ్ళ చదువుకో పెళ్ళికో పనికొస్తాయ్. ఇంక ఉమకి బంగారం గొలుసు ఎందుకిచ్చానని కదా నీ సందేహం. పేరుకి బంగారు గొలుసేకానీ అందులో బంగారం పాళ్ళు తక్కువ, రాగిపాళ్ళెక్కువ. ఎప్పటిదో నా బంగారు నెక్లెస్ కరిగించి గొలుసు చేయించుకుందామని కంసాలికిస్తే ఆ వెధవ ఆ బంగారమంతా కొట్టేసి రాగి కలిపి గొలుసు చేశాడు. అందుకే అది ఉమకి ఇచ్చేశాను. పరిస్థితులో, మారుతున్న కాలమో పిల్లల్ని మార్చేస్తున్నాయి. వాళ్ళనిబట్టి మేమూ తెలివి తెచ్చుకోవాలిగా. పిచ్చిమొహమా ఇప్పుడర్థమైందా నా గురించి? ఇంక నీ అపోహలు పోయినట్టేనా" ఆప్యాయంగా కోడలి తల నిమురుతూ అన్నది రమణమ్మ.

మంచుతెరలు వీడి ఉషోదయమైనట్టు ఆనందంగా తల ఊపింది సువర్చల.

○



## అంతా కాలమహిమ

ప్రస్తుతం 'నీలవేణి' అనే సినిమా చేస్తోన్న ఆర్తీ అగర్వాల్ ఇందులో హీరోగా మారుతున్న హిందీ విలన్ ముకుల్‌దేవ్ (తెలుగులోనూ విలన్‌గా నటించాడు)కి జోడీగా నటించడానికి ఒప్పుకుంది. అలాగే పోసాని కృష్ణమురళికి కూడా జంటగా నటించడానికి ఆర్తీ అంగీకరించినట్టు వినిపిస్తోంది. తన కాపురం అంత బాగా లేకపోవడం వల్లనే తన దృష్టిని సినిమాలవైపు మళ్లించిందని, అందుకే అమెరికా నుంచి టాలీవుడ్‌కి తిరిగొచ్చేసి ఎలాంటి చాన్స్ వచ్చినా ఒప్పేసుకుంటోందని అంటున్నారు. ఆర్తీ కెరీర్‌లో ఎంతలో ఎంత మార్పు?